క్లుప్తంగా

కాకినాడ వెళ్లి పింఛన్ అందజేత


తులసమ్మకు పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ సుధాకర్

సారవకోట: మండలంలోని గొల్రిబంద పంచాయతీ కోనవానిపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు దాసరి తులసమ్మ అనారోగ్యంతో కాకినాడలోని కుమార్తె వద్ద ఉంటుంది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ ముంజు సుధాకర్ ఆదివారం రాత్రి కాకినాడ వెళ్లి ఆమెకు పింఛన్ అందించారు. వంటీర్‌కు పలువురు అభినందించారు.

అన్నసమారాధన


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: మబగాం గ్రామంలో వినాయక నవరాత్రుల సందర్భంగా సోమవారం జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో గణేష్ మండపాలు ఏర్పాటు చేసి యువత ఐకమత్యాన్ని చాటుకున్నారన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఇతర సామాజిక అంశాలపై కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఘనంగా లాల్ బహదూర్ శాస్త్రి జయంతి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

పాతపట్నం: దేశ రెండో ప్రధానమంత్రి లాల్ బహదూర్‌శాస్త్రి చేసిన సేవలు మరువలేనివని మండలంలోని కొదూరు ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం ఎ.అప్పలస్వామి అన్నారు. పాఠశాలలో లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద భారత రాజ్యాంగం ముఖ్యాంశాలతో దేవరకొండ వెంకటేశ్వర్లు రచించిన పుస్తకాన్ని ఉపాధ్యాయుడు ఎ.దాలయ్య ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు ఎల్.గోవిందరావు, నారాయణరావు, పి.కృష్ణారావు, శంకరరావు, రామరావు, జి.కవీశ్వరరావు, దాలయ్య, గురాడి అప్పన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేటినుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

నరసన్నపేట: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నామని ఎంపీడీఓ బి.మధుసూదనరావు సోమవారం తెలిపారు. 3న సత్యవరంలో ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రారంభిస్తారన్నారు. 4న జమ్ములో, 5న తామరాపల్లిలో, 6న కరగాంలో, 7న కంబకాయలో, 9న కోమర్తిలో, 10న యారబాడులో, 11న నడగాంలో, 12న చిక్కాలవలసలో, 13న నరసన్నపేట-3లో, 16న నరసన్నపేట -1లో, 17న సత్యవరం రూరల్‌లో, 18న మడపాంలో, 19న రావులవలసలో, 20న ఉర్లాంలో, 21న గోపాలపెంటలో, 25న తెలగవలసలో, 26న చోడవరంలో, 27న నరసన్నపేట-4లో, 28న చెన్నాపురంలో, 30న బొరిగివలసలో, 31న కామేశ్వరిపేటలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు జలుమూరులో గడపగడపకు మన ప్రభుత్వం

జలుమూరు: మండల కేంద్రంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం మంగళవారం ఉదయం నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ వాన గోపి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాడు-నేడు పథకం ద్వారా పీహెచ్‌సీ అభివృద్ధి రూ.50 లక్షల నిధులతో చేపట్టనున్న పనులు, జల్ జీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

బూర్జ: మండలంలోని ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉప్పినివలస- ఎస్సీ జనరల్, లక్కుపురం-బీసీ-డి మహిళా అభ్యర్థి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు, పదో తరగతి, తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలన్నారు. సంబంధిత గ్రామ పంచాయతీకి చెందిన వ్యక్తి అయి ఉండాలన్నారు. ఈ నెల 7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ 87900 07229 నంబర్‌ను సంప్రదించాలన్నారు.


మెళియాపుట్టి: పెద్దమడి గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్


సారవకోట: మండల పరిషత్ ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అధికారులు


బూర్జ: ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రాజాప్రతినిధులు, అధికారులు


ఆమదాలవలస: కంద్రపేట జంక్షన్‌లోని గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి

మహాత్ముని జీవితం స్ఫూర్తిదాయకం


నరసన్నపేట: జమ్ము సచివాలయం వద్ద గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

వాడవాడలా జాతిపిత, మహాత్మా గాంధీ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు బాపూజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. దేశ స్వాతంత్రోద్యమంలో ఆయన పోషించిన పాత్రను వివరించారు. మహాత్ముని జీవితం స్ఫూర్తిదాయకమని, సత్యాన్ని మించిన ఆయుధం లేదని, అహింసకు సాటివచ్చే ఉద్యమం లేదని బలంగా నమ్మిన ఆయన శాంతియుత నిరసనల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన తీరు ప్రపంచానికే ఆదర్శమన్నారు. మనమంతా గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్


పాతపట్నం: పాతపట్నం కోర్టు కూడలిలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


పోలాకి: ఎంపీడీఓ కార్యాలయంలో మహాత్ముని విగ్రహానికి నివాళుర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు


నరసన్నపేట: యారబాడు ప్రాథమిక పాఠశాలలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఐ ప్రసాదరావు


నరసన్నపేట: నరసన్నపేట పంచాయతీ కార్యలయం వద్ద గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ బూరల్లి శంకర్


నరసన్నపేట: విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనం వద్ద గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రతినిధులు


హిరమండలం: భగీరథిపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


పాతపట్నం: పాతపట్నం శాఖాగ్రంథాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ ఉషారాణి


ఆమదాలవలస: లెప్రసీ కాలనీలో పేదలు, వృద్ధులకు దుస్తులు, పండ్లు అందజేస్తున్న శ్రీసత్యసాయి సేవా సమితి కార్యవర్గ సభ్యులు


ఆమదాలవలస రూరల్: తోటాడలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు


పొందూరు: లోలుగు పాఠశాలలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు


ఎల్.ఎన్.పేట: గార్లపాడు పునరావాస కాలనీలో గాంధీ విగ్రహానికి పూలమాలను వేస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు


జలుమూరు: పోలీస్ స్టేషన్ ఆవరణలోని గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు, విద్యార్థులు


ఆమదాలవలస: మెట్టక్కివలసలోని గాంధీనగర్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ రమేష్‌కుమార్, నాయకులు


సరుబుజ్జిలి: ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


కొత్తూరు: ఓంద్రుజోల గ్రామ సచివాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది


సారవకోట: సారవకోట శాఖాగ్రంథాలయంలో గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం


సారవకోట: 154 ఆకారంలో జేబీటీ పాఠశాల విద్యార్థులు

స్వచ్ఛతలో మేముసైతం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపుమేరకు సోమవారం ఊరూవాడా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వీధులు, కార్యాలయాల పరిసరాలను అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శుభ్రం చేశారు. – సాక్షి నెట్‌వర్క్


బూర్జ: ఓవిపేటలో రోడ్డును శుభ్రం చేస్తున్న ప్రజాప్రతినిధులు, సచివాలయ, వైద్య సిబ్బంది


పొందూరు: కోర్టు ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న న్యాయమూర్తి బి.జ్యోత్స్న, న్యాయవాదులు


కొత్తూరు: జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న న్యాయవాదులు, సిబ్బంది

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

బూర్జ: అందరి సహకారంతోనే మండలాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు ఆధ్వర్యంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా అధికారులు మాట్లాడారు. ఎలక్ట్రికల్ ఏఈ జి.అప్పన్న మాట్లాడుతున్న సమయంలో పలువురు సభ్యులు కలుగజేసుకున్నారు. గుత్తావల్లిలో ఇళ్ల పైనుంచి వెళ్తున్న విద్యుత్ వైర్లు తొలగించాలని, జిరాయితీలో ఉన్న ఎలక్ట్రికల్ ట్రాన్స్ ఫార్మర్ మార్చాలని, కొరగాంలో పోయిన బల్బులు మార్చాలని కోరారు. ఈఓపీఆర్డీ పి.విజయలక్ష్మి మాట్లాడుతూ.. గ్రీన్ అంబాసిడర్లకు జీతాల కోసం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లించేందుకు ఇటీవల జీఓ విడుదలైందన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరామ నాయుడు, తహసీల్దార్ ఎస్.రమణారావు, ఈఓపీఆర్డీ పి.విజయలక్ష్మి, స్థానిక సర్పంచ్ ఏగు అనురాధ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్


రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక ఎంఎల్‌ఆర్ నాయుడు జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రజలందరికీ వైద్యం అందుబాటులోనికి తీసుకువచ్చారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తూ అవసరమైన మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఈ విధంగా ఉచిత వైద్య శిబిరాలు అధికంగా నిర్వహించాలని సూచించారు. మెగా వైద్య శిబిరంలో 330 రోగులకు తనిఖీలు చేసి మందులు అందజేశారు. మోక్షా బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించి, 29 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ముద్దాడ బాలభూపాలనాయుడు, నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ జ్యోతీఫెడరిక్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం


పాతపట్నం: రక్తదానం చేస్తున్న విద్యార్థి


హిరమండలం: రక్తదానం చేసిన యువతకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శ్రీధర్

హిరమండలం: అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆరో వార్షికోత్సవం పురస్కరించుకుని సంస్థ వ్యవస్థాపకుడు పి.శ్రీధర్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 53 యూనిట్ల రక్తాన్ని శ్రీకాకుళం న్యూ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు సేకరించారు. రక్త దాతలను అభినందించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులను సన్మానించారు. మెగా వైద్య శిబిరంలో 111 మంది రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. నేత్ర వైద్య శిబిరంలో 102 మందికి కంటి పరీక్షలు చేపట్టారు. 30 మందికి నేత్ర శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. అవయవదానికి 30 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు.

పాతటప్నంలో..

పాతపట్నం: యువత రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని మహేంద్ర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా కళాశాలలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 26 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల డైరెక్టర్లు మధుబాబు, కిరణ్‌కుమార్, భుజింగరావు, అధ్యాపకులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి విశేష స్పందన


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: పేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని పెద్దపద్మాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా జరిగిన లబ్ధిని వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నామన్నారు. గ్రామానికి చెందిన కోట ధర్మారావు మాట్లాడుతూ..ఇటీవల తేనె టీగల దాడిలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న నాకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించి సీఎం జగన్ పునర్జన్మనిచ్చారన్నారు. గేదేల అమ్మాయమ్మ మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో చేయూత, పెన్షన్ కానుక, విద్యాదీవెన పథకాలతో కుటుంబమంతా రూ.4 లక్షల లబ్ధి పొందామని సంతోషం వ్యక్తం చేశారు. బైపోతు కమలమ్మ మాట్లాడుతూ పిల్లలు ఇంజినీరింగ్ చదువుతున్నారని, ఈ ప్రభుత్వంలో విద్యాదీవెన, ఇతర పథకాల ద్వారా రూ.3.71 లక్షల లబ్ధి పొందామన్నారు. సీఎం జగన్‌కు రుణపడి ఉంటామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు ఉర్లాన హంసమ్మ, పార్టీ మండల కన్వీనర్ పల్లి యోగి, ఉపకన్వీనర్లు శశిభూషణ్‌రావు, బైపోతు తేజారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, కోఆప్షన్ సభ్యుడు భాస్కరదాస్, పార్టీ నాయకులు పోలాకి జయమునిరావు, రామరాజు, టి.ప్రసాదరావు, నక్క బాబూరావు, పాపారావు, ఉర్లాన రవి, ఎంపీడీఓ చంద్రకుమారి, ఏఈ శ్రీనివాసరావు, ఏపీఎం లలిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాతృమూర్తి స్మరణలో..


సావిత్రమ్మ ఘాట్ వద్ద పూజలు నిర్వహిస్తున్న ధర్మాన సోదరులు

పోలాకి: ధర్మాన సోదరులు మాతృమూర్తి సావిత్రమ్మ 11వ వర్ధంతిని సోమవారం మబగాంలో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ధర్మాన రాందాస్, కుమార్తె కృష్ణవేణి, ఇతర కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.